క్లుప్తంగా

ప్లాస్టిక్ వ్యర్థాలను డ్రైనేజీల్లో వేయొద్దు



డ్రైనేజీని నుంచి తొలగించిన వ్యర్థాలు

మెట్‌పల్లి: ప్లాస్టిక్ వ్యర్థాలను డ్రైనేజీల్లో వేయవద్దని కమిషనర్ మోహన్ సూచించారు. పట్టణంలోని 7,8,20,22 వార్డుల్లో పారిశుద్య పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు చోట్ల డ్రైనేజీల్లో పేరుకపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను సిబ్బందితో బయటకు తీయించారు. ప్లాస్టిక్‌ను డ్రైనేజీల్లో వేయకుండా ఇంటికి వచ్చే మున్సిపల్ ఆటోలకు అందజేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

మెట్‌పల్లి: రైతుల అవసరానికి తగ్గట్టుగా కేంద్ర ప్రభుత్వం యూరియాను సరఫరా చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ డిమాండ్ చేశారు. పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. రాష్ట్రానికి 9.30లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరముండగా, కేంద్ర ప్రభుత్వం కేవలం 5.32 లక్షల మెట్రిక్ టన్నులను మాత్రమే సరఫరా చేసిందన్నారు. దీంతో కొరత ఏర్పడడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా కేటాయింపులకు అనుగుణంగా యూరియాను సరఫరా చేసి రైతులను ఆదుకోవాలన్నారు. సమావేశంలో సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మారుతి, మాజీ పట్టణాధ్యక్షుడు ఖుత్బుద్దీన్ తదితరులున్నారు.

సంగెంలో వైద్య శిబిరం



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెం గ్రామంలో ప్రజలు జ్వరాల బారిన పడుతుండటంతో యెఖీన్‌పూర్ ప్రైమరీ సబ్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది జ్వర బాధితుల నుంచి రక్త నమూనాలు సేకరించి డెంగీ, మలేరియా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శేఖర్, స్టాఫ్ నర్స్ రవళి, ఏఎన్‌ఎం సరోజ, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మేడిపల్లి: వారం రోజులగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా మండలంలోని పలు సమస్యాత్మక ప్రాంతాలను భీమారం తహసీల్దార్ రవి కిరణ్ ఎంపీడీవో నీరజ మంగళవారం పరిశీలించారు. కమ్మరిపేట లో లెవల్ బ్రిడ్జి, వెంకట్రావుపేట ఊరివాగు, రాగోజిపేట ఎస్సీ కాలనీ, దేశాయిపేట–గోవిందారం గ్రామల మధ్యన గల లోలెవల్ కల్వట్లతో పాటు పలు ప్రాంతాలను పరిశీలించారు. ఆర్‌ఐ రాజారాం, బక్కూరి నరేశ్, చుక్క తిరుపతి, జీపి సిబ్బంది ఉన్నారు.

పునరావాస కేంద్రాలకు తరలించాలి

ఇబ్రహీంపట్నం: గోదావరి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున చివరి ఇళ్ల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆర్డీవో శ్రీనివాస్ ఆదేశించారు. ఎస్సారెస్పీ 39 గేట్లను ఎత్తడంతో గోదావరి పరీవాహక గ్రామాలైన కోమటికొండాపూర్, ఎర్దండి వద్ద ఉధృతి పెరిగింది. చివరి ఇళ్ల ప్రజలకు జెడ్పీ పాఠశాలలో పునరావాసం కల్పించామని, వారిని అక్కడకు తరలించాలని తెలిపారు. తహసీల్దార్ వరప్రసాద్, ఆర్‌ఐ రమేశ్, సిబ్బంది రత్నం పాల్గొన్నారు.

ఎనిమిది దుకాణాలకు వేలం

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో నూతనంగా నిర్మించిన దుకాణాలకు మంగళవారం వేలం వేశారు. మార్కెట్‌రోడ్‌లోని కాంప్లెక్స్‌లో ఎనిమిది గదులను ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో పర్యవేక్షకులు రాజమౌళి సమక్షంలో వేలం వేశారు. మూడేళ్ల (31 ఆగస్టు 2028) కాలపరిమితితో వేలం వేయగా.. నెలకు రూ.80,800 చొప్పున ఎస్.వినోద్, ఎం.లత, రంజిత్, నర్సయ్య, సంధ్యారాణి, లావణ్య, చంద్రశేఖర్, పోచయ్య దక్కించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువైద్య భవనాలు

- మూగజీవాలకు అందని వైద్యం
- మూటపల్లి తాత్కాలిక భవనంలో పశువులకు వైద్యసేవలు
- పట్టించుకోని అధికారులు



మూటపల్లిలో పశువైద్యశాల భవనం



భూపతిపూర్‌లో శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాల

రాయికల్: మండలంలోని మూటపల్లి భూపతిపూర్ గ్రామాల్లోని పశువైద్య సబ్‌సెంటర్‌లో పశువైద్య భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనాల్లో వర్షం కురిస్తే వర్షపు నీరు రావడంతో పాటు, పైకప్పుల్లో ఉన్న పెచ్చులు పడిపోవడంతో పశువైద్య సిబ్బంది సైతం భయాందోళనగా విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని మూటపల్లిలో పశువైద్యశాల పూర్తిగా శిథిలావస్థకు చేరుకోగా భయాందోళనకు గురైన పశువైద్య సిబ్బంది గ్రామస్తుల సహకారంతో తాత్కాలికంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు తరలించారు. దీంతో గ్రామంలోని పశువులకు, గేదెలకు సరైన వైద్యసేవలు అందించాలంటే పశువైద్య సిబ్బందికి సైతం సరైన వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. అదే విధంగా మండలంలోని భూపతిపూర్ గ్రామంలోని సబ్‌సెంటర్‌లో వర్షం కురిస్తే వర్షం నీరు చేరడంతో పాటు, ఉన్న మందులు సైతం తడిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూపతిపూర్ సబ్ సెంటర్ పరిధిలోకి భూపతిపూర్, ఒడ్డెలింగాపూర్ ధర్మాజీపేట, కట్కాపూర్, దావన్‌పల్లి, కైరిగూడెం, తాట్లవాయి గ్రామాలు ఉండగా, 8500గొర్రెలు, 1640 ఆవులు, 2128 గేదెలున్నాయి. మూటపల్లి సబ్‌సెంటర్ పరిధిలో బోర్నపల్లి, జగన్నాథపూర్, చింతలూరు, బషీర్‌పల్లి, వస్తాపూర్, ఒడ్డెరకాలనీ, మూటపల్లి గ్రామాలు ఉండగా 11228 ఆవులు, గేదెలు, 2200 గొర్రెలు, మేకలున్నాయి. ఇప్పటికైనా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్,మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, జిల్లా పశువైద్యాధికారి స్పందించి శిథిలావస్థలో ఉన భవనాల స్థానంలో సొంత భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి, భవనాలు నిర్మించాలని యాదవులు, పాడి రైతులు కోరుతున్నారు.

భారీ వర్షాలతో పొంగి పొర్లుతున్న వాగులు



రాయికల్‌లో మత్తడి దూకుతున్న చెరువు



ఉధృతంగా ప్రవహిస్తున్న బొల్లెవాగు

జగిత్యాలరూరల్: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. జగిత్యాల అర్బన్ మండలం పెర్కపల్లి గ్రామ శివారులోని బొల్లెవాగు పొంగి పొర్లుతోంది. అనంతారం వద్ద భారీగా వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో పాటు ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండి మత్తళ్లు దూకుతున్నాయి.

రాయికల్‌లో ఎడతెరిపి లేని వర్షం

రాయికల్: రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని 32 గ్రామాల్లో మంగళవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురవడంతో చెరువులకు వర్షపు నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. బోర్నపల్లి గోదావరి, రాయికల్ మత్తడిపై ఉధృతంగా నీరు ప్రవహిస్తోంది. బోర్నపల్లి గోదావరి బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిని చూడడడానికి పర్యాటకుల సందడి నెలకొంది.

ముసురు వర్షం.. చెరువులకు చేరని నీరు

కథలాపూర్: మండలంలో రెండు రోజులుగా ముసురుతో కూడిన వర్షం కురుస్తోంది. ముసురు వర్షం కురియడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడ్డారు. కానీ ఈ ముసురు వర్షం వల్ల గ్రామాల్లోని చెరువుల్లోకి నీరు చేరకపోవడంతో ప్రజలు నిరాశకు గురవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసినప్పటికి మండలంలో ముసురు వర్షానికి పరిమితమవడంతో పంటలకు సాగు నీరందడం ఎలా అని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ముసురు వర్షంతో ఆయా గ్రామాల్లో మట్టి రోడ్లు బురదమయమయ్యాయి.

20.3 మీ.మీ వర్షపాతం

మల్లాపూర్: అల్పపీడనం ప్రభావంతో రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండల వ్యాప్తంగా చెరువులు, కుంటలు పూర్తిగా నిండిపోయి మత్తడి దుంకుతున్నాయి. గోదావరినది, పెద్ద వాగులు ప్రమాదకరంగా పొంగిపొర్లుతున్నాయి. మంగళవారం మండల వ్యాప్తంగా 20.3 మీ.మీ.ల వర్షం కురిసిందని ఏఎస్‌వో పురుషోత్తం తెలిపారు. గోదావరినది, పెద్దవాగులు ఉధృతంగా ప్రవహించడంతో పాటు చెరువులు, కుంటలు నిండిపోయి ప్రమాదకరంగా మారడంతో ఆర్డీవో శ్రీనివాస్, తహశీల్దార్ రమేష్‌గౌడ్, ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి, ఎంపీవో జగదీష్, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది కలిసి పరిశీలించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మరో రెండు రోజుల పాటూ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పశువుల కాపర్లు పశువులను మేతకు తీసుకెళ్లవద్దని, జాలర్లు చేపల వేటకు వెళ్లరాదని సూచించారు.

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కమ్మునూర్ వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మంగళవారం సాయంత్రం కమ్మునూర్ వద్ద 3 లక్షల క్యూసెక్కుల నీరు వరద నీరు ప్రవహిస్తున్నట్లు ఎస్సారెస్పీ ఈఈ చక్రునాయక్ తెలిపారు. బీర్‌పూర్ ఎస్సై రాజు పోలీస్‌సిబ్బందితో గోదావరి తీరం వెంట గ్రామాలను పర్యటిస్తూ ఎవ్వరూ గోదావరి వైపు వెళ్లకూడదని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దన్నారు.

టీఎల్‌ఎంతో అర్థవంతమైన బోధన

ధర్మపురి: టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం)తో అర్థవంతమైన బోధన లభిస్తుందని ఎంపీడీవో రవీందర్ అన్నారు. మండల ప్రాథమికోన్నత పాఠశాల టీఎల్‌ఎం మేళా కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఉపాధ్యాయుల ప్రదర్శనలలో ప్రతిభ చాటిన పది మందిని జిల్లా స్థాయికి ఎంపిక చేసి ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావ్, ఎంఈవో సీతామహాలక్ష్మి, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి టీఎల్‌ఎం మేళాను నిర్వహించారు. ఈ మేళాలో 81 బోధన అభ్యాసన సామగ్రిని ఉపాధ్యాయులు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో 10 ఉత్తమ టీఎల్‌ఎమ్‌లను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు ఎంఈవో మధు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఎంఆర్సీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కథలాపూర్: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం మండలస్థాయి బోధన అభ్యాసన సామగ్రి మేళా నిర్వహించారు. ఉపాధ్యాయులు తెలుగు, గణితం, ఇంగ్లిష్‌తో పాటు పరిసరాల విజ్ఞానం తదితర బోధన అంశాల నుంచి తయారు చేసిన అభ్యాసన సామగ్రిని ఈ మేళాలో ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నారాయణరెడ్డి, తహసీల్దార్ వినోద్, ఎంపీడీవో శంకర్, ఎంఈవో శ్రీనివాస్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు అర్జున్, కిషన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలో ఎంఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీచర్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం) మేళా నిర్వహించారు. టీఎల్‌ఎం మేళాను ఎంపీడీవో స్వరూప రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మండలంలోని 29 ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ మేళాలో ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులకు ప్రశంస పత్రాలను అందజేశారు.

పోచమ్మతల్లికి పూజలు

జగిత్యాలటౌన్: భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారం లోకమాత పోచమ్మతల్లి అని జగిత్యాల డీఎస్పీ దుర్శెట్టి రఘుచందర్ అన్నారు. మంగళవారం పురాణిపేటలోని పోచమ్మతల్లిని దర్శించుకున్న రఘుచందర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ 63వ వార్షికోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉత్సవ ప్రచార రథాన్ని డీఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ నెల 20 తేదీ నుంచి 23 వరకు సాగే ఉత్సవాల్లో ప్రజలంతా భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని, అమ్మ దయతో ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అలయ కమిటీ నిర్వాహకులు గాజుల రాజేందర్, నాగమల్ల మనోహర్, గాజోజు రాజగోపాలచారి, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి చేయాలి

మెట్‌పల్లి: వచ్చే స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డెపల్లి శ్రీనివాస్ సూచించారు. ఆయనను మంగళవారం బీజేపీ పట్టణాధ్యక్షులు బొడ్ల రమేశ్, పలువురు నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలో బీజేపీ బలంగా ఉందని, గత అసెంబ్లీ ఎన్నికల్లో కోరుట్లలో రెండో స్థానంలో నిలిచిందన్నారు. రాబోయే ప్రతీ ఎన్నికల్లో పార్టీకి గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సుంకేట విజయ్, కుడుకల రఘు, హన్మాండ్లు, బోగ దత్తు, కాదాసు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేత

కొడిమ్యాల:మండలంలోని కొండాపూర్‌కు చెందిన సుంకే సత్తవ్వ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. ఆమె యూనియన్ బ్యాంకులో రూ.436తో బీమా తీసుకుంది. దీంతో ఆమెకు రూ.2లక్షల బీమా విడుదల కావడంతో ఆమె కుమారుడు సుంకే నరేశ్‌కు బ్యాంక్ కొడిమ్యాల బ్రాంచ్ మేనేజర్ సంజీవ్ కుమార్ మంగళవారం అందించారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



విద్యార్థులకు పెన్నులు అందిస్తున్న క్లబ్ సభ్యులు

కోరుట్ల/మెట్‌పల్లి/ గొల్లపల్లి/ పెగడపల్లి/ ఇబ్రహీంపట్నం: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కోరుట్ల కెమెరా క్లబ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, పేదలకు అన్నదానం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్కులు, పెన్నులు పంపిణీ చేశారు. మెట్‌పల్లి పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఫొటోగ్రాఫర్లను సన్మానించారు.గొల్లపల్లి: గొల్లపల్లి మండల కేంద్రంలో మంగళవారం మండల ఫొటో, వీడియో మిక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటోగ్రాఫర్లు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పెగడపల్లి అంబేడ్కర్ కూడలి వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.ఇబ్రహీంపట్నంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో. కెమెరా సృష్టికర్త లూయిస్ డాగ్యూరే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

రామాలయ వార్షికోత్సవాలు ప్రారంభం



కుంకుమ పూజలో మహిళలు

కథలాపూర్: మండల కేంద్రంలోని శ్రీ సీతారాముడి ఆలయంలో వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవాలయంలో భక్తులు సామూహికంగా కుంకుమ పూజలు, మంగళ గౌరీ వ్రతాలు నిర్వహించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

సహస్ర లింగాల దేవాలయంలో పుష్పాలంకరణ

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామ శివారులోని సహస్ర లింగాల దేవాలయంలో శ్రావణ మంగళవారం ఆరుద్ర నక్షత్రంతో కూడుకుతున్న ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని అభిషేకంతో పాటు, పండ్లు, పుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నపూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు నలమాసు గంగాధర్ పాల్గొన్నారు.

దుబ్బరాజన్న ఆలయంలో ఉట్టి వేడుకలు



ఉట్టికొడుతున్న యువకులు

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయంలో మంగళవారం సాయంత్రం గోపాల కాలువల సందర్భంగా ఉట్టికొట్టే కార్యక్రమం ఘనంగా జరిగింది. శ్రావణమాసం చివరి సోమవారం మరుసటి రోజు ప్రతీ సంవత్సరం ఈ వేడుకను దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో పెంబట్ల, కోనాపూర్, పోచంపేట గ్రామాల ప్రజలు ఆలయ ఆవరలో ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టడానికి పోటీపడగా కోనాపూర్ యువకులు ఉట్టికొట్టి విజేతగా నిలిచారు. అంతకు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు జరిగాయి.



మల్లాపూర్: మండలంలోని రత్నాపూర్ రెండో అంగన్‌వాడీ కేంద్ర భవనం పెచ్చులూడుతూ ప్రమాదకరంగా మారింది. ఈ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్, ఆయాతో పాటు పూర్వ విద్యను అభ్యసిస్తున్న 22 మంది చిన్నారుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడూ ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి



మల్లాపూర్‌లో వర్షంలో నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

మల్లాపూర్: ఆశ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను అంగీకరించడంతో పాటు సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆశ కార్యకర్తలు నిరసన బాట పట్టారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశ కార్యకర్తలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండల ఆశ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు శారధ, సభ్యులు లయ, శిరీష, సరిత, భూదేవి, ప్రేమలత, లావణ్య, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళ వారం ఆశావర్కర్లు తమ సమస్యలను, డిమాండ్లను పరిష్కరించాలని నిరసన తెలియజేశారు. గతంలో ప్రతినెల జీతాలు 30 వ తేదీన పడేవని కానీ జూలై నెల జీతాలు ఇప్పటివరకు అందలేదని దీనివల్ల మేము చాలా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు. ఫిక్స్‌డ్ వేతనం నెలకు రూ.18 వేలు చెల్లించాలన్నారు, పీఎఫ్, ఈఎస్‌ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇతర పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో లక్ష్మి, రూప, సత్యమ్మ ,స్వప్న, జలజ తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశాలల తనిఖీ

కథలాపూర్: మండలంలోని అంబారిపేట, కథలాపూర్ పశువైద్యశాలలను జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వేణుగోపాల్‌రావు మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. రెండు పశు వైద్యశాలల్లో రికార్డులను తనిఖీ చేశారు. పశువులకు వాక్సిన్లు సకాలంలో వేస్తున్నారా, రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నారా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట మండల పశు వైద్యాధికారులు శ్రీనివాస్, దివ్యశ్రీ ఉన్నారు.

సామాజిక సేవకుడికి అంబేడ్కర్ అవార్డు

మేడిపల్లి: మండల కేంద్రానికి చెందిన సామాజిక సేవకుడు మెట్టుదాసు మెక్సికో టోలాస అమెరికా యూనివర్సిటీ ఆధ్వర్యంలో అందిస్తున్న అంబేడ్కర్ అంతర్జాతీయ అవార్డుకు ఎంపిక కాగా, యూనివర్సిటీ ఇండియా కోర్డినేటర్ డాక్టర్ కేఏ జనార్ధన్ మంగళవారం మహారాష్ట్రలోని సోలాపూర్‌లో అవార్డు అందజేశారు. మెట్టు దాసు గ్రామీణ ప్రాంతంలో విద్యా, ఆరోగ్యం, ఆర్థికం అనే అంశాల పైన చేస్తున్న సేవలకు గానూ అవార్డు అందజేసినట్లు తెలిపారు.

మసూద్ అలీబేగ్‌కు ..

రాయికల్: మండలంలోని అల్లీపూర్ గ్రామానికి సామాజిక సేవకుడు మసూమ్ అలీబేగ్ మంగళవారం మహారాష్ట్రలోని సోలాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ ఇంటర్నేషనల్ అవార్డు మెక్సికో యూనివర్సిటీ ప్రొఫెసర్ కట్ట బొమ్మన, జాన్ మాస్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను తెలంగాణ కో–ఆర్డినేటర్ కాయితి శంకర్, దాసు, కొత్తపల్లి రాజేశ్వర్, అంగడి ఆనంద్ అభినందించారు.

స్కేటింగ్‌లో విద్యార్థి ప్రతిభ

జగిత్యాల: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని బౌరంపేట్ శ్రీరాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కేటింగ్ నిర్వహించిన స్కేటింగ్ ట్రిబ్యూట్ టు ఇండియన్ ఆర్మ్‌డ్ ఫోర్స్ ఫర్ ఆపరేషన్ సిందూర్ కార్యక్రమంలో భాగంగా పోటీల్లో జిల్లా జిల్లా కేంద్రంలోని మానస స్కూల్‌కు చెందిన విద్యార్థి అద్వైత్ పాల్గొన్నాడు. తన ప్రతిభతో మూడు ప్రపంచ రికార్డులు సృష్టించాడు. యునైటెడ్ ఇండియా వరల్డ్ రికార్డ్, స్పోర్ట్స్ వరల్డ్ రికార్డు, అమేజింగ్ వరల్డ్ రికార్డు విభాగాల్లో 79 నిమిషాల పాటు స్కేటింగ్ చేసి రికార్డు సృష్టించాడు. ఈ సందర్భంగా మానస స్కూల్ ప్రిన్సిపాల్ రజితరావు విద్యార్థిని అభినందించారు.

జాతీయ రహదారిపై నేలకొరిగిన వృక్షం

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామ శివారులో జగిత్యాల–నిజామాబాద్ ప్రధాన రహదారిపై గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షానికి చల్‌గల్ గ్రామ శివారులో జాతీయ రహదారి పక్కనున్న భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో రాకపోకలు నిలిచిపోవడంతో విషయం తెలుసుకున్న రూరల్ ఎస్సై సదాకర్ సంఘటన స్థలానికి చేరుకుని జేసీబీ సాయంతో వృక్షాన్ని తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.

కూలిన చెట్టు తప్పిన ప్రమాదం

పెగడపల్లి: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెగడపల్లి భక్త మార్కండేయ ఆలయం వద్ద చింత చెట్టు మంగళవారం సాయంత్రం నేలకొరిగింది. దీంతో కొంత సేపు రాక పోకలు నిలిచిపోయాయి. చెట్టు కూలిన సమయంలో ఆ ప్రాంతంలో ఎవరు లేక పోవడం, వాహనదారులు కూడా రాక పోవడంతో ప్రమాదం తప్పింది. గ్రామ పంచాయతీ సిబ్బంది జేసీబీ సాయంతో చెట్టును తొలగించారు.

వెంకట్రావ్‌పేటలో కూలిన ఇల్లు

మల్లాపూర్: మండలంలోని వెంకట్రావ్‌పేటలో భారీ వర్షానికి దాసరి వెంకు అనే మహిళకి చెందిన పెంకుటిల్లు మంగళవారం కూలిపోయింది. విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు, అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి కూలిన ఇల్లును పరిశీలించి బాధితురాలిని పరామర్శించారు.ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ

కొడిమ్యాల: కొడిమ్యాల, పూడూరు, తిర్మలాపూర్ రైతు వేదికల్లో మంగళవారం రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనిలో భాగంగా శాస్త్రవేత్తలు పాత మామిడి తోటల పునరుజ్జీవనం గురించి, వాతావరణ బులెటిన్, డిజిటల్ వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ గురించి రైతులకి వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ కొడిమ్యాల రైతువేదికలో, జిల్లా ఉద్యాన అధికారి శ్యామ్ ప్రసాద్ పూడూరు రైతువేదికలో హాజరయ్యారు. కార్యక్రమాల్లో మండల వ్యవసాయ అధికారి జ్యోతి, ఉద్యాన అధికారి స్వాతి, రైతులు పాల్గొన్నారు.